క్లుప్తంగా

నృత్య విద్యార్థులకు ఆర్థికసాయం



కల్వకుర్తిరూరల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన 15 మంది నృత్య విద్యార్థులు కూచిపూడి నృత్యంలో మంచి ప్రతిభ కనబర్చి యాదగిరిగుట్టలో నిర్వహించే పోటీలకు ఎంపిక చేసినట్లు జీఎస్ డ్యాన్స్ అకాడమీ నృత్య శిక్షకుడు శేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు మధు, బాలస్వామిగౌడ్‌లు విద్యార్థులకు రూ.10వేల చొప్పున మొత్తం రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు.

తొలి ఏకాదశికి అనుమతివ్వాలి

మన్ననూర్: తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని లొద్ది మల్లయ్య క్షేత్రానికి వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని హిందు వాహిని నాయకులు పులిజాల శేఖర్, సంబు శ్రీనివాసులు ఆదివారం అధికారులకు విజ్ఞప్తి చేశారు. నల్లమల ప్రాంత భక్తులు దశాబ్దాలుగా లొద్ది మల్లయ్య క్షేత్రంలో ఈ పండగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు. హిందు పండుగలకే నిబంధనలు పెట్టడం సరికాదని అధికారులకు పునరాలోచించాలని కోరారు. ఏకాదశి పర్వదినాన స్వామివారి దర్శనానికి అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కొల్లాపూర్: అచ్చంపేట పట్టణంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో కొల్లాపూర్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. తైక్వాండో కోచ్‌లు రాజుయాదవ్, భాస్కర్‌ల నేతృత్వంలో విద్యార్థులు వేర్వేరు బృందాలుగా పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో 11 మంది గోల్డ్ మెడల్స్, ఐదుగురు సిల్వర్ మెడల్స్, ముగ్గురు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులు ఈనెల 19 నుంచి 21 వరకు మంచిర్యాల జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తైక్వాండో కోచ్‌లు పేర్కొన్నారు.

బాధితుడికి మాజీ మంత్రి పరామర్శ

చారకొండ: మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన నకినమోని పెద్దయ్య యాదవ్ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొంది ఇంటిలో విశ్రాంతి పొందుతున్నాడు. ఈ సందర్భంగా మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్ ఆదివారం గ్రామానికి వెళ్లి బాధితుడిని పరామర్శించి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రాములు యాదవ్, తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

తాడూరు: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఎస్‌ఐ మహేష్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలను పట్టుకొని జరిమానా విధించారు. ధ్రువపత్రాలను పరిశీలించి వాహనదారులకు కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచించారు.

వీల్ చైర్ పంపిణీ



చారకొండ: మండలంలోని అగ్రహారం తండాలో సత్యహరిచంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జైకుమార్ నాయక్‌కు వీల్‌చైర్ అందజేశారు. దివ్యాంగులకు అండగా ఉంటామని ఫౌండేషన్ నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గ్రామస్తులు ఉన్నారు.

క్యాషియర్‌కు సన్మానం

చారకొండ: మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన అక్కి శ్రీనివాస్ గౌడ్ ఇటీవల ఏపీజీవీబీ క్యాషియర్‌గా నియామకం అయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఖాతాదారులు క్యాషియర్‌ను పూలమాలతో, శాలువాలతో సన్మానించారు.

పార్టీ మారిన ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి

కొల్లాపూర్: బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేయాలని బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు దేవని కుమార్‌మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం సరికాదన్నారు. రాజ్యాంగంపై చిత్తశుద్ధి ఉంటే పార్టీ మారిన ఎమ్మెల్యేలు రాజీనామా చేసి మళ్లీ పోటీ చేయాలని కోరారు.

శిథిలావస్థలో భవనాలు



కూలడానికి సిద్ధంగా ఉన్న పాఠశాల భవనం పై కప్పు



శిథిలావస్థకు చేరిన నార్లాపూర్ పాఠశాల భవనం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన భవనాలు శిథిలావస్థకు చేరాయి. పైకప్పులు పెచ్చులూడుతున్నాయి. వర్షాకాలం కావడంతో స్లాబ్‌ల నుంచి నీరు కారుతోంది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. గదులు చిత్తడి చిత్తడిగా తయారవడంతో చదువుకునేందుకు అవస్థలు పడుతున్నారు. ఎప్పుడు కూలుతుందో తెలియని దుస్థితి నెలకొందని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళకు గురవుతున్నారు. పలు భవనాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

వివరాలు ఇలా..

మండలంలోని నార్లాపూర్‌లో 50 సంవత్సరాల కిందట ప్రాథమిక పాఠశాల భవనం నిర్మించారు. ప్రస్తుతం ఈ భవనం శిథిలావస్థకు చేరింది. నాలుగు గదుల్లో వర్షపు నీరు కారుతోంది. గోడలు నెర్రలు బారాయి. పై కప్పు ఊడి పడుతోంది. 1 వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 85 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అదే విధంగా నల్లమల అడవి సమీపంలో గేమ్యానాయక్ తండాలో ఉన్న పాఠశాల భవ నం, మొలచింతపల్లిలో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనంలో రెండు గదులు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. నర్సింగరావు పల్లి ఉన్న ప్రాథమిక పాఠశాల భవనం కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఈ పాఠశాలలో 80 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న భవనాలను కూల్చివేసి నూతనంగా భవనాలను నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



కొన్ని సంవత్సరాల కిందట నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఉంది. పిల్లలను పాఠశాలకు పంపిచడం లేదు. ఎన్నో సార్లు పాలకులకు చెప్పిన పట్టించుకోవడం లేదు. మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– కిరణ్, నార్లపూర్

పెచ్చులూడుతున్నది వాస్తవమే..

పాఠశాల భవనం పెచ్చులూడుతున్నది వాస్తవమే. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలకు పంపించేందుకు ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వం స్పందించి వెంటనే కొత్త భవనాలను నిర్మించాలి. భవనానికి మరమ్మతు పనులు చేపట్టాలి. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ప్రభుత్వం నిధులు కేటాయించి కొత్త భవనాలు నిర్మించే విధంగా చర్యలు చేపట్టాలి.

– మద్దిలేటి, నార్లాపూర్ ప్రధానోపాధ్యాయుడు

ఘనంగా మల్లురవి జన్మదిన వేడుకలు



మల్లురవిని కలిసిన కొల్లాపూర్ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లురవి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌లో ఎంపీని కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీపీసీసీ నాయకుడు రంగినేని జగదీశ్వరుడు, కొల్లాపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాముయాదవ్, సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శిం పసుల రాజేశ్‌రెడ్డి ఎంపీని కలిశారు. మన్ననూర్‌లోని అంబేడ్కర్ కూడలి, ఊర్కొండ, వెల్దండలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాయకులు కేట్ కట్ చేసి పంచిపెట్టారు. కల్వకుర్తి ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పరశురామ్‌నాయుడు, జూలూరు సత్యనారాయణ, మోతిలాల్‌నాయక్, పర్వత్‌రెడ్డి, ఆనంద్, సుదర్శన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



కల్వకుర్తిరూరల్: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని జిల్లెల్ల గ్రామ అభివృద్ధికి రూ.5 లక్షల నిధులను మంజూరు చేస్తూ హైదరాబాద్‌లో దీనికి సంబంధించిన కాపీని మాజీ సర్పంచ్ రాములుకు అందజేశారు. ఇప్పటికే గ్రామ అభివృద్ధికి రూ.80 లక్షల నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఊర్కొండలో గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటం ఉన్నత పాఠశాలకు చెందిన 1992–93 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గ్రామ సమీపంలోని లక్ష్మీదేవమ్మ గుట్ట దగ్గర మృగవాని హరిత హోటల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఉద్యోగ, కుటుంబవివరాలను అడిగి తెలుసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు. విద్యాబోధన విశేషాలు, పాఠశాల అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఊర్కొండ: మండలంలోని మాదారం జెడ్పీహెచ్‌ఎస్ 2003– 04 సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. సంబురపడ్డారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాలకు రూ.15 వేలు ప్రింటర్ బహూకరించారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

వారాంతపు సంతకు వర్షం ఆటంకం



లింగాల: మండల కేంద్రంలో ఆదివారం వారాంతపు సంతకు వర్షం ఆటంకం కలిగించింది. సుదూర ప్రాంతాల నుంచి కూరగాయలు విక్రయించేందుకు వ్యాపారులు తరలివచ్చారు. కూరగాయలు విక్రయించే సమయంతో వర్షం కురవడంతో ఇబ్బందిపడ్డారు. వర్షంలోనే కూరగాయలు తడిసి ముద్దయ్యాయి. సంత బజారులో సౌకర్యాలు కల్పించాలని వ్యాపారులు, రైతులు కోరుతున్నారు.

దుండగులను గుర్తించి శిక్షించాలి



పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

మన్ననూర్: కాకతీయుల కాలం నాటి ప్రతాప రుద్రుని కోట ముఖ ద్వారం వద్ద గుప్త నిధుల కోసం తవ్వకాలు చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులతో కలిసి ఆయన సంఘటన ప్రాంతానికి వెళ్లి పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్లాస్టిక్ నిషేధం, వన్య ప్రాణి సంరక్షణ చట్టం నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధించడం ఉన్న ధ్యాస అటవీ ప్రాంతంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు చేస్తే ఎందుకు పట్టించుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. ఘటన జరిగి నాలుగు రోజులైన అధికారులు పట్టించుకోకపోవడంతో అటవీశాఖ అధికారులు సిబ్బందిపై అనుమానాలకు తావిస్తోందని ఆయన ఆరోపించారు. చరిత్ర ఆనవాళ్లను శిథిలం చేస్తూ గుప్త నిధుల పేరుతో తవ్వకాలు చేస్తున్న దుండగులను ఇప్పటికైనా గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అమ్రాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు గోలి రాజు, నాయకులు శంకర్‌గౌడ్, శ్రీనివాస్, ప్రసాద్, అనిల్, శాంతి కుమార్‌గ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.20 లక్షల విరాళం



చెక్కును అందజేస్తున్న భూపతిరెడ్డి

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు భూపతిరెడ్డి ఆదివారం రెడ్డి సేవా సమితి భవన నిర్మాణానికి రూ.20 లక్షలు విరాళంగా కమిటీ సభ్యులకు అందజేశారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో ఇటర్నేషనల్ రెడ్డి సమితి సత్రం నిర్మాణం కోసం కమిటీ సభ్యులు విరాళాలను సేకరిస్తున్నారు. ఈ మేరకు కమిటీ సభ్యులు బొబ్బిలి దామోదర్‌రెడ్డి, కృష్ణారెడ్డిలకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజిరెడ్డి, యాదగిరిరెడ్డి, శిశిపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పోటెత్తిన భక్తులు



పెద్దకొత్తపల్లి: మండలంలోని నాయనోనిపల్లి మైసమ్మ దర్శినానికి ఆదివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో వంటలు చేసుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. హైదరాబాద్, గద్వాల, వనపర్తి, పెబ్బేరు, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ ప్రాంతాల నుంచి భక్తులతో ఆలయం పరిసరాలు కిటకిటలాడాయి.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



వెల్దండ: మండల కేంద్రంలోని బుదార్‌పేట్ హనుమాన్ దేవాలయ ఆవరణంలో ఆదివారం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శాస్త్రోక్తంగా కల్యాణతంతును జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. స్వామి వారి కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, సంఘం విద్యా కమిటీ రాష్ట్ర చైర్మన్ మిడిదొడ్డి శ్యాంసుందర్, పూరి చిన్న బాలరాజ్, నాయకులు బాలరాజ్, పూరి రమేష్, బాలస్వామి, శ్రీను, తదితరులు ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



తాడూరు: మండల కేంద్రం నుంచి గుంతకోడూరు, మేడిపూర్ మీదుగా కల్వకుర్తి వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ డబుల్‌రోడ్డును అనుసరించుకొని తవ్విన కాల్వ ప్రమాదభరితంగా మారింది. కేఎల్‌ఐ కాల్వ నీటి కోసం రైతులే స్వయంగా జేసీబీ ద్వారా తవ్వి వదిలేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా కాల్వ కనపడకుండా గడ్డి, పిచ్చి మొక్కలతో మూసుకుపోయింది. వాహనదారులు ప్రమాదాలబారిన పడే అవకాశం ఉందని అధికారులు స్పందించి వెంటనే కాల్వను పూడ్చివేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పట్టణంలో ముసురు

కొల్లాపూర్: పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా ముసురు పట్టింది. శనివారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. వర్షంతో పాటు చల్లటి గాలులు వీచాయి. వర్షాల ప్రభావంతో చెరువుల్లో నీటిమట్టం పెరిగింది. పలు చోట్ల రహదారులు బురదమయంగా మారాయి.

పీర్లను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే



కోడేరులో పీర్లను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కోడేరు: మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆదివారం పీర్లను దర్శించుకొని మొక్కులను చెల్లించుకున్నారు. గత ప్రభుత్వం హయాంలో పీర్ల చావిడి మరమ్మతు కోసం రూ.2 లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు మరమ్మతు పనులు పూర్తి కావడంతో మసీదు కమిటీ నాయకులు మాజీ ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో రాజుగౌడు, నగం రవి, స్కైలాబ్ తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో పీర్ల చావిడిలో పీర్లు కొలువుదీరాయి. ఈ నెల 17న పీర్ల ఊరేగింపు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. యువకులు అలయ్ బలాయ్ ఆడుతూ సందడి చేశారు.

పెంట్లవెల్లి: మండలంలోని మల్లేశ్వరం, మంచాలకట్ట, జటప్రోల్ గ్రామాల్లో మొహర్రం వేడుకలు కొనసాగుతున్నాయి. మహిళలు బొడ్డెమ్మలు, యువకులు అలయ్ బలయ్, కోలాటాలు ఆడారు.

బల్మూర్: మండలంలోని మహాదేవ్‌పూర్‌లో మంగళవారం నుంచి ప్రారంభమయ్యే మొహర్రం వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాతో పాటు నల్గొండ, రంగారెడ్డి జిల్లాల నుంచి భక్తులు తరలివస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

కొల్లాపూర్ రూరల్: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా దౌర్జన్యంగా భూములను తీసుకున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి. ఈశ్వర్ అన్నారు. ఆదివారం మండలంలోని ఎల్లూరు గ్రామ సమీపంలో ఉన్న చెంచుగూడెన్ని ఆయన సందర్శించారు. అనంతరం ఆదివాసీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేఎల్‌ఐ ప్రాజెక్టులో ఏడు ఎకరాల భూమి, పాలమూరు ప్రాజెక్టు డేగల బండ పెంట దగ్గర 10 ఎకరాల భూమిని చెంచుల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు దౌర్జన్యంగా తీసుకున్నారని ఆరోపించారు. పరిహారం అడిగితే వారిపై కేసులు పెడుతామని బెదిరించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. కొంత మంది అధికార పార్టీ నాయకులు చెంచుల భూములను ఆక్రమించుకున్నారన్నారు. ప్రభుత్వం చెంచుల భూములను వెంటనే వారికి ఇప్పివ్వాలని ఆయన డిమాండ్ చేశారు. నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 15న కొల్లాపూర్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతునట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, చెంచులు పాల్గొన్నారు.

ఎంపీ డీకే అరుణను కలిసిన నాయకులు



ఎంపీ డీకే అరుణను సన్మానిస్తున్న నాయకులు

వెల్దండ: మహబూబ్‌నగర్ ఎంపీ డీకె అరుణను మండలానికి చెందిన బీజేపీ నాయకులు ఆదివారం హైదరాబాదులో మర్యాద పూర్వకంగా కలసి సన్మానించారు. అదే విధంగా త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని రాజ్‌భవన్ కలిశారు. కల్వకుర్తి నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ మాజీ బీసీ కమిషన్ సభ్యులు ఆచారి, కల్వకుర్తి కన్వీనర్ శేఖర్‌రెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, పరమేష్‌గౌడు తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా రోడ్డు



కుంగిన ప్రధాన సీసీ రోడ్డు

తెలకపల్లి: మండల కేంద్రం నుంచి నుంచి లింగాలకు వెళ్లే ప్రధాన రోడ్డు కటుగాల్వ కల్వర్టు వద్ద ప్రధాన సీసీ రోడ్డు కుంగిపోయి ప్రమాదభరితంగా మారింది. దాదాపు సంవత్సరం కాలంగా సీసీ రోడ్డు కుంగిపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పలు గ్రామాలకు ఈ మార్గం ద్వారానే వెళ్లాల్సిందే. రోడ్డు కుంగడంతో వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు. కొందరు వాహనం పైనుంచి కిందపడి తీవ్ర గాయాలైన ఘటనలు ఉన్నాయి. మరమ్మతు చేయాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

రైతన్న బిజీబిజీ



తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా ఆయా గ్రామాల రైతులు వ్యవసాయ పనులపై నిమగ్నమయ్యారు. అత్యధికంగా పత్తి, మొక్కజొన్న వంటి పంటలను రైతులు సాగు చేశారు. వరి నాటేందుకు తుకాలు వేసుకొని వరినారు మడులు చదును చేసుకుంటున్నారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి సాగు చేసిన పత్తి పంటకు గుంటుకలు తోలడంతోపాటు యూరియా, డీఏపీ వేసుకోవడం , కలుపు తీసుకోవడం వంటి పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ప్రస్తుతానికి వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్త చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తా సమీపంలో దేశిటికాలా గ్రామానికి చెందిన కత్తె మల్లేష్‌కు సంబంధించిన గొర్రెలు గడ్డి మేస్తున్నాయి. సమీపంలో తెగిపడిన విద్యుత్ తీగలకు తగిలి మూడు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి.

గేదెలు మృతి

అచ్చంపేట రూరల్: మండలంలోని పలకపల్లిలో ఆదివారం ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలిన రెండు గేదేలు ప్రమాదవశాత్తు మృతి చెందాయి. రైతు సుధాకర్‌రెడ్డికి సంబంధించిన రెండు గేదెలను వ్యవసాయ పొలానికి తీసుకెళ్తుండగా కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైరును తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. రెండు గేదెల విలువ రూ. 1.60లక్షలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

అరుదైన శస్త్ర చికిత్స

నాగర్‌కర్నూల్ క్రైం: యువకుడికి అతుకున్న నాలుకను శస్త్ర చికిత్స ద్వారా వేరుచేసినట్లు జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రఘు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగర్‌కర్నూల్‌కు చెందిన చందు 18 ఏళ్లుగా పుట్టుకతోనే నాలుక అతుక్కొని ఉండటంతో మాట్లాడలేనిస్థితిలో ఉన్నాడు. బాధిత కుటుంబసభ్యులు జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రఘును కలిసి చందు పరిస్థితి వివరించారు. ఈ మేరకు సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ గాయత్రి, డాక్టర్ భరద్వాజ్ అతుకున్న నాలుకను విజయవంతంగా శస్త్ర చికిత్స ద్వారా వేరుచేశారు.